బయో ఆసియా..
ఆవిష్కరణలు అదుర్స్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో ప్రారంభమైన లైఫ్‌సైన్సెస్, హెల్త్‌కేర్ ఫోరమ్ బయో ఆసియా సదస్సు 22వ ఎడిషన్‌లో ఏర్పాటుచేసిన అంతర్జాతీయ ట్రేడ్ షో సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నది. ఈ ప్రదర్శనలో ఏర్పాటుచేసిన పలు స్టాల్స్‌ను పరిశీలిస్తే..

ప్రయోగాలకు ఎలుకలు అందిస్తాం



వ్యాక్సిన్‌లు లేదంటే ప్రాణ రక్షక ఔషధాల పనితీరును ముందుగా పరీక్షించేది మానవ జన్యు నిర్మాణానికి దగ్గరలో ఉన్న ఎలుకలు, కోతులు వంటి వాటి పైనే. ప్రీ క్లినికల్ ట్రయల్స్‌కు ఇప్పటికీ ఎలుకలపై ఆధారపడుతుంటారు. నిర్దిష్టమైన సమస్యను లక్ష్యంగా చేసుకుని ప్రయోగాలు చేసే కంపెనీల కోసం ఎలుకలలో జన్యు పరివర్తన చేసి ఇచ్చే సంస్థ జనీవర్ ల్యాబ్స్ ఫ్రాన్స్ కేంద్రంగా కార్యకలాపాలను ఈ సంస్థ నిర్వహిస్తోంది. ప్రస్తుతం మనిషి కాలేయానికి దగ్గరగా ఉండే రీతిలో కాలేయం కలిగిన ఓ ఎలుకను అభివృద్ధి చేశామని, కాలేయ వ్యాధులపై పరిశోధనలకు ఇది తోడ్పడుతుందని ఆ సంస్థ ఇంటర్నేషనల్ ఆపరేషన్స్ హెడ్ లిలీ పేర్కొంటున్నారు. బెంగళూరులో పదేళ్లుగా ఉంటున్న ఆమెకు హైదరాబాద్‌లోని పలు కంపెనీలకు సైతం తాము వీటిని సరఫరా చేశామంటున్నారు.

ప్రొటీన్ సీక్వెన్సింగ్‌ను సులభంగా చేస్తోంది



ప్రోటీన్ సీక్వెన్సింగ్ అనేది చాలా వరకూ ఫార్మా ల్యాబ్‌లతో పాటుగా డయాగ్నోస్టిక్ ల్యాబ్‌లలోనూ కనిపిస్తుంది. గతంలో ప్రోటీన్ సీక్వెన్సింగ్ చేయాలంటే సమయం, ఖర్చుతో కూడుకోవడంతో పాటుగా ఫలితాలపై కూడా సందేహం ఉండేది. ఇప్పుడు అలాంటి సమస్యలకు చెక్ పెడుతూ ప్లాటినం ప్రోటీన్ సీక్వెన్సర్ తీసుకువచ్చామంటున్నారు క్వాంటమ్ డాట్ ఎస్ఐ ప్రతినిధులు. దీని కోసం ప్రత్యేకంగా ల్యాబ్ అవసరం లేదని, నైపుణ్యం కూడా పెద్దగా అవసరం లేదంటున్నారు.

స్మార్ట్ రీయూజబుల్ నోట్ బుక్



ఏఐతో పనిచేసే స్మార్ట్ రీ యూజబల్ నోట్ బుక్‌ను విడుదల చేసింది క్వాడ్రిక్ ఐటీ సంస్థ. టీ హబ్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహించే ఈ సంస్థ రీనోట్ ఏఐ పేరిట దీనిని విడుదల చేసింది. మీరు మీ నోట్స్‌తో మాట్లాడే అవకాశం కల్పించే ఈ రీనోట్, మీకు కావాలనుకుంటే అదనపు సమాచారం కూడా అందిస్తుంది. ఈ నోట్‌బుక్ వాటర్ ప్రూఫ్, చిరగదు. డాటా ఎప్పటికీ మీ బుక్‌లోనే ఉంటుంది. దీని ధర రూ.999. కానీ, ఆఫర్‌లో భాగంగా రూ.499 అందిస్తున్నారు.

ప్యాకేజింగ్‌లోనూ పర్యావరణ పరిరక్షణ

వ్యాక్సిన్‌ల ప్యాకేజింగ్‌లకు ఉష్ణోగ్రత నియంత్రణ తప్పనిసరని ప్లానెట్ ప్రొటెక్టర్ సంస్థ ప్రతినిధులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఊలుతో తయారుచేసిన ప్యాకేజింగ్ బాక్స్‌లను వీరు బయో ఆసియా సదస్సులో భాగంగా ప్రదర్శిస్తున్నారు. ప్రస్తుతానికి ఆస్ట్రేలియాలో మాత్రమే కార్యకలాపాలు నిర్వహిస్తోన్న ఈ సంస్థ తమ మలి మజిలీగా హైదరాబాద్‌ను ఎంచుకుంది. త్వరలోనే ఇక్కడి నుంచి కార్యకలాపాలు ప్రారంభించనుందని సంస్థ ప్రతినిధి నమిత బంకా తెలిపారు.

డీఎన్ఏ ప్రొఫైలింగ్ అందుబాటులోకి : ఏజిలెంట్ టెక్నాలజీ

మన శరీరం పరిస్థితిని క్షుణ్ణంగా తెలుసుకోవాలంటే డీఎన్ఏ ప్రొఫైలింగ్ చేయించుకోవాలి. ఇలా చేయడం ద్వారా రాబోయే ఆరోగ్య సమస్యలను ముందుగా గుర్తించడం, చికిత్స అందించడం సులభతరం అవుతుంది. ఏజిలెంట్ టెక్నాలజీ డీఎన్ఏ విశ్లేషణకు అవసరమైన యంత్రాలను సమకూర్చుతుంది. వీటిని ప్రముఖ ఆస్పత్రులు, పరిశోధన సంస్థలకు అందిస్తున్నాం.

ఫార్మా, క్లినికల్ ట్రయల్స్‌లో ఏఐ సహకారం : కోగెనిక్ ఏఐ

కృత్రిమమేథ సహకారంతో ఫార్మా రంగంలో ఔషధాల తయారీ, క్లినికల్ ట్రయల్స్ పరిశోధనలను సులభంగా నిర్వహించే అవకాశాన్ని కోగెనిక్ ఏఐ అందుబాటులోకి తెచ్చింది. ఔషధాల తయారీతోపాటు వాటి వినియోగం వల్ల వచ్చే దుష్ఫలితాలను కృత్రిమ మేథ ద్వారా గణించి, ప్రభుత్వ నిబంధనలకు తగిన విధంగా నివేదికను రూపొందించే సాఫ్ట్‌వేర్‌ను రూపొందించినట్లు సంస్థ కో ఫౌండర్ రమేష్ సేత్ తెలిపారు.

ఎక్కడికైనా తీసుకెళ్లగలిగే ఈజీ సర్వర్ రూమ్



ఐటీ, ఫార్మా సంస్థలు తమ కంప్యూటర్లను, అందులో ఉన్న సమాచారాన్ని భద్రపరుచుకునేందుకు సర్వర్లు కీలకం. వెర్టివ్ సర్వర్ రూమ్‌ను అన్ని భద్రత ఏర్పాట్లతోపాటు సులభంగా ఒకచోట నుంచి మరో చోటికి తీసుకెళ్ల వచ్చని తయారీ దారులు తెలిపారు. ప్లగ్ అండ్ ప్లే తరహాలో సర్వర్ రూములు రూపొందిస్తున్నామని, ఆయా సంస్థలకు అవసరమైన విధంగా కస్టమైజేషన్ చేసి అందిస్తామన్నారు.

రూ.4,030 కోట్లతో
రతన్‌టాటా రోడ్డు

- 41.50 కి.మీల గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రహదారి
- 28వ తేదీ నుంచి టెండర్లు



రతన్ టాటా రోడ్డు (చిలకపచ్చ రంగులో ఉన్న గీత)

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఓఆర్ఆర్‌లోని రావిర్యాల(టాటా ఇంటర్ చేంజ్) నుంచి ఫ్యూచర్ సిటీ మీదుగా ఆమన్‌గల్ వద్ద ప్రతిపాదిత ఆర్ఆర్ఆర్ వరకు నిర్మించ తలపెట్టిన గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రహదారికి రాష్ట్ర ప్రభుత్వం రతన్‌టాటా రోడ్డుగా పేరు పెట్టింది. ఈ రోడ్డును రూ.4,030 కోట్లతో నిర్మించనున్నారు. 41.50 కి.మీ.ల పొడవు ఉండే ఈ రతన్ టాటా రహదారి నిర్మాణాన్ని రెండు దశల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొదటి దశలో రూ.1,665 కోట్లతో ఓఆర్ఆర్ రావిర్యాల(టాటా ఇంటర్‌చేంజ్) నుంచి మీర్‌ఖాన్ పేట వరకు 19.2 కి.మీ దూరం రోడ్డు నిర్మాణం చేపడతారు. రెండోదశలో రూ.2,365 కోట్లతో మీర్‌ఖాన్‌పేట(ఫ్యూచర్‌సిటీ) నుంచి ఆర్ఆర్ఆర్ (ఆమన్‌గల్) వరకు 22.30 కి.మీ దూరం రహదారి నిర్మాణం చేయనున్నారు. ఈ రహదారి నిర్మాణ బాధ్యతలను ప్రభుత్వం హెచ్ఎండీఏకు, హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్(హెచ్‌జీసీఎల్) సంస్థలకు అప్పగించింది. ఈ నేపథ్యంలో రహదారి నిర్మాణ పనులకు సంబంధించిన టెండర్లను ఫిబ్రవరి 28 నుంచి స్వీకరిస్తామని హెచ్ఎండీఏ మంగళవారం ప్రకటించింది. టెండర్ వివరాలను తమ అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచింది. సాంకేతిక బిడ్లను మార్చి 21న తెరుస్తామని హెచ్ఎండీఏ వెల్లడించింది.

పరీక్షలపై ప్రణాళికతో ముందుకెళ్దాం

- త్వరలోనే పది, ఇంటర్ పరీక్షలు
- పథక రచనతో చదివితే విజయం సాధ్యమే

బంజారాహిల్స్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మార్చిలో ఇంటర్, ఆ వెంటనే పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులు ఇప్పటి నుంచే కచ్చితమైన పథక రచన చేయాలని విద్యారంగ నిపుణులు సూచిస్తున్నారు. సరదాలను పక్కనపెట్టి కచ్చితమైన ప్రణాళిక రూపొందించుకోవాలని సూచిస్తున్నారు. ఓటమికి ప్రధాన కారణం కచ్చితమైన ప్రణాళిక లేకపోవడమేనని మానసిక రంగ నిపుణులు చెబుతున్నారు.

కచ్చితమైన ప్రణాళికతోనే విజయం..

తరగతిలో విద్యార్థులందరికీ అదే ఉపాధ్యాయులు పాఠాలు చెబుతారు. ఒకే పరిస్థితుల్లో వారికి చదువులు.. ఒకే రకమైన పాఠ్యపుస్తకాలు.. పరీక్షలు ఉంటాయి. అయితే కొందరికి తక్కువ మార్కులు వస్తే మరికొందరు మంచి ప్రతిభ చూపుతారు. అయితే కచ్చితమైన ప్రణాళికతో ప్రతి ఒక్కరూ విజయం సాధించవచ్చని మానసిక నిపుణులు సూచిస్తున్నారు. మంచి ప్రణాళిక 50 శాతం విజయానికి దోహదం చేస్తుందని చెబుతున్నారు. కొందరు రాత్రి అంతా చదువుతారు. మరికొందరు మధ్యాహ్నం చదివేందుకు ఇష్టపడతారు. ఇంకొందరు తెల్లవారుజామున నిద్రలేచి చదువుతుంటారు. ఈ క్రమంలో వారికి ఏ సమయంలో ఏకాగ్రత బాగా ఉంటుందో గ్రహించి ఆ సమయంలో ఎక్కువసేపు చదువుకుంటే మంచిది.

వాయిదా వేయడం సరికాదు..

పరీక్షలకు మరో వారం సమయం ఉంది. అని చాలా మంది చదవడాన్ని వాయిదా వేస్తారు. రేపటి నుంచి మొదలు పెడదాంలే అనుకుంటారు. ఇలా వాయిదా వేయడం వల్ల ఇబ్బందులు ఎదురవుతాయి. పరీక్షలప్పుడు రాత్రి పొద్దుపోయే వరకు చదువుతూ ఉంటే శరీరం సహకరించక సరిగా రాయలేని పరిస్థితి తలెత్తుతుంది. అందుకని ముందు నుంచే వ్యూహం సిద్ధం చేసుకోవాలి. పరీక్షలకు ఎంత సమయం ఉంది? చదవాల్సిన సిలబస్ ఎంత? ఎన్ని రోజుల్లో పూర్తి చేయాలి?.. ఇలా కచ్చితమైన పథకం వేసుకోవాలి. ప్రతి వ్యక్తికి మెదడులో కొన్ని ప్రత్యేకమైన విభాగాలు ఉంటాయి. వాటి పనితీరు భిన్నంగా ఉంటుంది. అందుకే రోజంతా ఒకే సబ్జెక్టు కాకుండా రెండు మూడు సబ్జెక్టులు కవర్ చేసేలా ప్రణాళిక రూపొందించుకోవాలి. ఇష్టం ఉన్నవాటిని చదివిన తర్వాత ఇతర సబ్జెక్టులు చదవడం వల్ల మెదడు మరింత సమర్థవంతంగా పనిచేస్తుందని అనేక పరిశోధనలు తేల్చాయి. ప్రతి విద్యార్థికి తొలి లక్ష్యమైన పదో తరగతిని ప్రత్యేకంగా చూడాలంటున్నారు నిపుణులు. మార్చి 15 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభవుతున్న క్రమంలో ప్రణాళిక సిద్ధం చేసుకుని రివిజన్ చేయాలి.



పరీక్ష రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

స్నేహితుడి కుమార్తె పట్ల అసభ్యకర ప్రవర్తన

- జీరో ఎఫ్ఐఆర్ నమోదు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): స్నేహితుడి కుమార్తె పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదైంది. వనపర్తికి చెందిన భార్యాభర్తలకు ఎనిమిదవ తరగతి చదువుతున్న కుమార్తె(12) ఉంది. బాలిక తండ్రి స్నేహితుడు ప్రశాంత్ తరుచూ వారి ఇంటికి వచ్చేవాడు. ఈ క్రమంలో బాలికతో అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు దుస్తులు తొలిగించి పైశాచికంగా వ్యవహరించాడు. అతని ప్రవర్తన కారణంగా బాలిక మానసికంగా కుంగిపోయింది. ఆమె ప్రవర్తనలో మార్పు కనిపించడంతో తల్లికి అనుమానం వచ్చి నిలదీయగా జరిగింది చెప్పింది. దీంతో బాలిక తల్లి ప్రశాంత్‌ను నిలదీయగా నిర్లక్ష్యంగా సమాధానమిచ్చాడు. తనను ఎవరూ ఏం చేయలేరంటూ బెదిరించే ప్రయత్నం చేశాడు. దీంతో బాలికతో కలిసి నగరంలోని రహ్మత్‌నగర్‌లో ఉన్న తన పుట్టింటికి వచ్చింది. విషయం పుట్టింటికి వారికి చెప్పి వారి సహకారంతో మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ప్రశాంత్‌పై పోక్సో చట్టం కింద జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసును వనపర్తికి బదిలీ చేశారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోండి

- అధికారులకు సూచించిన కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

బోరబండ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా జలమండలి అధికారులు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ సీఎన్ రెడ్డి సూచించారు. జలమండలి డీజీఎం వాహద్‌తో కలిసి ఆయన రహ్మత్‌నగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పైపులైన్‌లో గేట్‌వాల్ సమస్య ఉంటే సరిచేయాలన్నారు. నీటి సరఫరాలో సమయ పాలన పాటించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ సూర్యప్రకాశ్, పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్పొరేటర్‌కు సన్మానం..

నగరాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీలో రెండవసారి అవకాశం పొందిన సందర్భంగా కార్పొరేటర్ సీఎన్ రెడ్డికి డీసీసీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహ్మద్ మోసిన్ ఖురేసీ సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు మైనార్టీ సెల్ సభ్యులు పాల్గొన్నారు.



రహ్మత్‌నగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, జలమండలి డీజీఎం

జూబ్లీహిల్స్ టీటీడీ ఆలయంలో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

బంజారాహిల్స్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్‌లోని తిరుమల తిరుపతి దేవస్థానం 5వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. మంగళవారం ఆలయ అర్చకులు బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. ఈ క్రమంలో ప్రతిరోజూ ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



విద్యార్థులకు ప్రాజెక్ట్ వర్క్ గురించి వివరిస్తున్న ఓయూ రిజిస్ట్రార్ ప్రొ.నరేష్‌రెడ్డి

విద్యార్థులకు ప్రాజెక్ట్ వర్క్‌పై అవగాహన

ఖైరతాబాద్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): లక్డీకాపూల్‌లోని ఐఐఎంసీ కళాశాల ప్రాంగణంలో డిగ్రీ, పీజీ విద్యార్థులకు ప్రాజెక్ట్ వర్క్‌పై మంగళవారం అవగాహన కల్పించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ కళాశాల, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొ. నరేష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి సంస్థల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. అదేవిధంగా కళాశాలలు సైతం జాతీయ విద్యా విధానం మేరకు సమాజ అవసరాలకు ఉపయోగపడే సాంకేతిక కోర్సులను బోధించాలని సూచించారు. విద్యార్థుల కోసం నిత్యం ఏదో ఒక కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వారిలో ఉన్న నైపుణ్యాలను వెలికితీస్తున్న కళాశాలల్లో ఐఐఎంసీ ముందు వరుసలో ఉందన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కూర రఘువీర్ ఆధ్వర్యంలో 'ప్రాజెక్ట్ వర్క్ గైడెన్స్' అనే పాకెట్ డైరీని ఆవిష్కరించారు. ఈ సదస్సులో జంట నగరాలకు చెందిన 50 కళాశాల నుంచి 800లకు పైగా విద్యార్థులు హాజరయ్యారు.కార్యక్రమంలో ఐపీఈ డైరెక్టర్ శ్రీనివాసమూర్తి, ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు పాట్రిక్, రంజని, నరేంద్రనాథ్, సత్యనారాయణ, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

శైవాలయాలకు మహాశివరాత్రి శోభ

అమీర్‌పేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి వేడుకలకు శైవాలయాలు ముస్తాబయ్యాయి. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని అమీర్‌పేట హనుమాన్ ఆలయంలో ఉదయం 4.30 గంటల నుంచి ప్రత్యేక అభిషేకం, సాయంత్రం 4 గంటల నుంచి లింగ స్పర్శదర్శనం, రాత్రి 10 గంటలకు శివపార్వతుల కల్యాణోత్సవం, రాత్రి 12 గంటలకు లింగోద్భవ అభిషేకం నిర్వహిస్తున్నట్లు ఈవో జయంతి వెల్లడించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. బాపూనగర్‌లోని వీరాంజనేయ వెంకటేశ్వర సాయిబాబా ఆలయం, సైంటిఫిక్ కాలనీలోని సాయిమణికంఠ ఆలయం, బల్కంపేటలోని ఆంజనేయ సాయిబాబా శివాలయం వేడుకలకు ముస్తాబయ్యాయి.

పాత పెన్షన్ విధానం అమలుకు పోరాడతాం

- పాఠ్యపుస్తక ముద్రణాలయం ఉద్యోగులు



యుద్ధభేరి పోస్టర్లను ప్రదర్శిస్తున్న ముద్రణాలయ ఉద్యోగులు

ఖైరతాబాద్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠ్యపుస్తక ముద్రణాలయం ఆవరణలో మంగళవారం గేట్ మీటింగ్ జరిగింది. యూనియన్ హైదరాబాద్ కమిటీ అధ్యక్షుడు ఎన్. నరేందర్‌రావు, అంజిరెడ్డి, కార్యవర్గ సభ్యులు హాజరై సీపీఎస్ రద్దు, ఓల్డ్ పెన్షన్ స్కీం అమలు తదితర డిమాండ్ల సాధన కోసం మార్చి 2న ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న యుద్ధభేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరేందర్‌రావు మాట్లాడుతూ.. కొన్ని రాష్ట్రాల్లో సీపీఎస్ రద్దు చేసి ఓల్డ్ పెన్షన్ స్కీం అమలు చేస్తున్నారని, తెలంగాణలోనూ ఓల్డ్ పెన్షన్ స్కీం అమలు కోసం పోరాటం చేస్తామన్నారు. మార్చి 2న జరిగే కార్యక్రమానికి ఉద్యోగులు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమములో జి.నటరాజ్, చంద్రమోహన్, ఏ.రోహిత్, సి.కిషోర్‌గౌడ్, వెంకటేశ్వర్లు , ఎం.రవికుమార్, జగన్మోహన్, ఎండీ హజార్ అలీ, పి.శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్సీ అభ్యర్థి రాజ్‌కుమార్ పటేల్

పంజాగుట్ట, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులు, పట్టభద్రుల సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేస్తానని కరీంనగర్-ఆదిలాబాద్-నిజామాబాద్-మెదక్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి, తెలంగాణ గ్రాడ్యుయేట్స్ ఫోర్స్ వ్యవస్థాపకుడు డాక్టర్ బండారి రాజ్‌కుమార్ పటేల్ అన్నారు. ఈ నెల 27న జరిగే ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు తనకు వేసి గెలిపించాలని పట్టభద్రులను కోరారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న బీసీ అభ్యర్థులు బీసీ సంఘాల నాయకులకు, మేధావులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. కోట్ల రూపాయలు ఉన్న వ్యాపారికి, మాఫియాకు మద్దతు తెలపడం ఏంటన్నారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న(చింతపండు నవీన్), బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, బీసీ మేధావుల ఫోరం చైర్మన్ టి.చిరంజీవులు తదితరులకు ప్రస్తుతం పోటీలో ఉన్న కార్పొరేట్ శక్తులు, ప్రభుత్వంతో చీకటి ఒప్పందం జరిగిందని ఆయన ఆరోపించారు. ఈ సమావేశంలో డాక్టర్ కృష్ణప్రియ, శ్రీనివాస్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్‌కుమార్

విద్యుత్ ప్రైవేటీకరణను విరమించుకోవాలి

- దేశవ్యాప్త సమ్మెకు మద్దతిస్తున్నాం
- పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ సదానందం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రైవేటీకరణకు నిరసనగా జూన్ 26న దేశవ్యాప్త సమ్మె చేయాలన్న విద్యుత్ ఉద్యోగులు, జాతీయ సమన్వయ కమిటీ నిర్ణయానికి మద్దతు తెలుపుతున్నామని పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ సదానందం పేర్కొన్నారు. దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేసేందుకు ఏప్రిల్, మే నెలల్లో పెద్ద ఎత్తున అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం ఖైరతాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. చండీగఢ్‌లో లాభాల్లో ఉన్న విద్యుత్ శాఖను ప్రైవేట్ పరం చేసిన విధానాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం రూ.లక్షా పది వేల కోట్ల నష్టం వాటిల్లిందని చెబుతున్నా, రాష్ట్ర ప్రభుత్వ బకాయిలే వేల కోట్లు ఉన్నాయన్నారు. టారిఫ్ అథారిటీ పోటీ బిడ్డింగ్, ఆస్తుల మానిటైజేషన్ పేరుతో ట్రాన్స్‌మిషన్ రంగాన్ని ప్రైవేటీకరిస్తున్నారని, ఆ ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రైవేట్ సంస్థల నుంచి విద్యుత్ కొనడం వల్ల వినియోగదారులపై అధిక బిల్లులతో భారం పడుతుందన్నారు. ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకొని విద్యుత్ ప్రైవేటీకరణ చర్యలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

మహిళల పట్ల అసభ్య ప్రవర్తన.. కేసు నమోదు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కారులో ఉన్న మహిళలపై అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 4లో నివాసముండే ఫారుక్ నిర్మాణ కార్మికుడు. ఈ నెల 20న ఆయన భార్య, ఆమె స్నేహితురాలితో కలిసి కారులో వెళ్తుండగా రోడ్డు నంబర్ 4 మార్గమధ్యలో ఓ వ్యక్తి అడ్డుకొని అసభ్యంగా ప్రవర్తించాడు. కారు అద్దంపై కొడుతూ భయాందోళనకు గురిచేశాడు. జరిగిన విషయాన్ని ఫారుక్‌కు చెప్పారు. ఫరూక్ ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగదు, ల్యాప్‌టాప్ మాయమయ్యాయని ఫిర్యాదు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఓ కంపెనీ కార్యాలయంలో ఉన్న నగదు, సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ మాయమయ్యాయి. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 10లో సెన్సీ గవర్నమెంట్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట ఓ ప్రైవేట్ కంపెనీకి చెందిన కార్యాలయం ఉంది. కంపెనీ ఉద్యోగి శివ నాగరాజు ఈ నెల 24న రోజు మాదిరిగానే కార్యాలయం తెరిచాడు. ఓ క్యాబిన్‌లో చూడగా అందులో ఉండాల్సిన 50 వేల నగదు, ల్యాప్టాప్, మొబైల్ ఫోన్ కనిపించలేదు. ఇదే కార్యాలయంలో పనిచేస్తున్న ఎర్రన్నరెడ్డిపై అనుమానం వ్యక్తం చేస్తూ శివనాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక విధానాలపై మహిళలకు అవగాహన కల్పించాలి

- బ్యాంకర్లకు సూచించిన ఆర్బీఐ అధికారి జగదీష్‌కుమార్
- బ్యాంకర్స్ కమిటీ ఆధ్వర్యంలో 2కె వాక్‌థాన్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇడియా, స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఓయూ క్యాంపస్‌లో 2 కె వాక్‌థాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ డిప్యూటీ జనరల్ మేనేజర్ టి.జగదీష్ కుమార్ మాట్లాడుతూ.. మహిళా వ్యాపారవేత్తల వృద్ధికోసం బ్యాంకర్లు పనిచేయాలని, మహిళా ఖాతాదారులకు ఆర్థిక విధానాలపై మరింత అవగాహన కల్పించాలన్నారు. హైదరాబాద్ సర్కిల్ ఎస్‌బీఐ సీజీఎం రాజేష్ కుమార్, ఎస్ఎల్‌బీసీ తెలంగాణ కన్వీనర్ ప్రకాష్ చంద్ర బారోర్, బ్యాంక్ ఉద్యోగులు పాల్గొన్నారు.



వాక్‌థాన్‌లో పాల్గొన్న జగదీష్‌కుమార్, ఉద్యోగులు, విద్యార్థులు

గుర్తుతెలియని వృద్ధుడి మృతి

అడ్డగుట్ట, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లో ఫుట్‌పాత్‌పై గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడు. గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్ఐ మాధవి తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ సమీపంలోని గురుద్వారా వద్ద మెడికల్ దుకాణం సమీపంలో గుర్తుతెలియని వృద్ధుడు (60) చనిపోయి ఉండగా సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి ఆచూకీ వివరాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు.

యువతిని మోసం చేసిన యువకుడి అరెస్ట్

బర్కత్‌పుర ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): యువతిని మోసం చేసిన యువకుడిని కాచిగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. చైతన్యపురిలో నివసిస్తున్న సాయినిఖిల్(23)కు అంబర్‌పేటకు చెందిన ఓ యువతి ఫేస్‌బుక్‌లో పరిచయమైంది. మూడేళ్లుగా ఇద్దరి మధ్య ప్రేమ వ్యవహారం నడుస్తోంది. పెళ్లి చేసుకోవాలని యువతి ఒత్తిడి చేయడంతో ముఖం చాటేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిని మంగళవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు.

వ్యక్తి అదృశ్యం

బర్కత్‌పుర ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఓ రైలు ప్రయాణికుడు అదృశ్యమయ్యాడు. శివరాంపల్లికి చెందిన సుధ, తన తమ్ముడు దినేష్ కుమార్ (43) ఉజ్జయినిలో ఈ నెల 23 రాత్రి రైలు ఎక్కారు. 24 ఉదయం 5.30 గంటలకు సుధ చూడగా దినేష్ కనిపించలేదు. నగరానికి చేరుకున్న ఆమె కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి మధ్యప్రదేశ్‌లోని ఆమ్లా రైల్వే పీఎస్‌కు బదిలీ చేశామని సీఐ ఎల్లప్ప తెలిపారు.

ట్రాఫిక్ పోలీసులకు సూచనలు



పంజాగుట్ట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి సిబ్బందికి సూచనలు చేస్తున్న నగర ట్రాఫిక్ సంయుక్త కమిషనర్ జోయల్ డెవిస్.

- పంజాగుట్ట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి)

బయో ఆసియా...
ఆవిష్కరణలు అదుర్స్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో ప్రారంభమైన లైఫ్‌సైన్సెస్, హెల్త్‌కేర్ ఫోరమ్ బయో ఆసియా సదస్సు 22వ ఎడిషన్‌లో ఏర్పాటుచేసిన అంతర్జాతీయ ట్రేడ్ షో సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నది. ఈ ప్రదర్శనలో ఏర్పాటుచేసిన పలు స్టాల్స్‌ను పరిశీలిస్తే..

ప్రయోగాలకు ఎలుకలు అందిస్తాం



వ్యాక్సిన్‌లు లేదంటే ప్రాణ రక్షక ఔషధాల పని తీరును ముందుగా పరీక్షించేది మానవ జన్యు నిర్మాణానికి దగ్గరలో ఉన్న ఎలుకలు, కోతులు వంటి వాటి పైనే. ప్రీ క్లినికల్ ట్రయల్స్‌కు ఇప్పటికీ ఎలుకలపై ఆధారపడుతుంటారు. నిర్దిష్టమైన సమస్యను లక్ష్యంగా చేసుకుని ప్రయోగాలు చేసే కంపెనీల కోసం ఎలుకలలో జన్యు పరివర్తన చేసి ఇచ్చే సంస్థ జనీవర్ ల్యాబ్స్. ఫ్రాన్స్ కేంద్రంగా కార్యకలాపాలను ఈ సంస్థ నిర్వహిస్తోంది. ప్రస్తుతం మనిషి కాలేయానికి దగ్గరగా ఉండే రీతిలో కాలేయం కలిగిన ఓ ఎలుకను అభివృద్ధి చేశామని, కాలేయ వ్యాధులపై పరిశోధనలకు ఇది తోడ్పడుతుందని ఆ సంస్థ ఇంటర్నేషనల్ ఆపరేషన్స్ హెడ్ లిలీ పేర్కొంటున్నారు. బెంగళూరులో పదేళ్లుగా ఉంటున్న ఆమెకు హైదరాబాద్‌లోని పలు కంపెనీలకు సైతం తాము వీటిని సరఫరా చేశామంటున్నారు.

ప్రొటీన్ సీక్వెన్సింగ్‌ను సులభంగా చేస్తోంది



ప్రోటీన్ సీక్వెన్సింగ్ అనేది చాలా వరకూ ఫార్మా ల్యాబ్‌లతో పాటుగా డయాగ్నోస్టిక్ ల్యాబ్‌లలోనూ కనిపిస్తుంది. గతంలో ప్రోటీన్ సీక్వెన్సింగ్ చేయాలంటే సమయం, ఖర్చుతో కూడుకోవడంతో పాటుగా ఫలితాలపై కూడా సందేహం ఉండేది. ఇప్పుడు అలాంటి సమస్యలకు చెక్ పెడుతూ ప్లాటినం ప్రోటీన్ సీక్వెన్సర్ తీసుకువచ్చామంటున్నారు క్వాంటమ్ డాట్ ఎస్ఐ ప్రతినిధులు. దీనికోసం ప్రత్యేకంగా ల్యాబ్ అవసరం లేదని, నైపుణ్యం కూడా పెద్దగా అవసరం లేదంటున్నారు.

స్మార్ట్ రీయూజబల్ నోట్ బుక్



ఏఐతో పనిచేసే స్మార్ట్ రీ యూజబల్ నోట్ బుక్‌ను విడుదల చేసింది క్వాడ్రిక్ ఐటీ సంస్థ. టీ హబ్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహించే ఈ సంస్థ రీనోట్ ఏఐ పేరిట దీనిని విడుదల చేసింది. మీరు మీ నోట్స్‌తో మాట్లాడే అవకాశం కల్పించే ఈ రీనోట్, మీకు కావాలనుకుంటే అదనపు సమాచారం కూడా అందిస్తుంది. ఈ నోట్‌బుక్ వాటర్‌ప్రూఫ్, చిరగదు. డాటా ఎప్పటికీ మీ బుక్‌లోనే ఉంటుంది. దీని ధర రూ.999. కానీ, ఆఫర్‌లో భాగంగా రూ.499 అందిస్తున్నారు.

ప్యాకేజింగ్‌లోనూ పర్యావరణ పరిరక్షణ

వ్యాక్సిన్‌ల ప్యాకేజింగ్‌లకు ఉష్ణోగ్రత నియంత్రణ తప్పనిసరని ప్లానెట్ ప్రొటెక్టర్ సంస్థ ప్రతినిధులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఊలుతో తయారుచేసిన ప్యాకేజింగ్ బాక్స్‌లను వీరు బయో ఆసియా సదస్సులో భాగంగా ప్రదర్శిస్తున్నారు. ప్రస్తుతానికి ఆస్ట్రేలియాలో మాత్రమే కార్యకలాపాలు నిర్వహిస్తోన్న ఈ సంస్థ తమ మలి మజిలీగా హైదరాబాద్‌ను ఎంచుకుంది. త్వరలోనే ఇక్కడి నుంచి కార్యకలాపాలు ప్రారంభించనుందని సంస్థ ప్రతినిధి నమిత బంకా తెలిపారు.

డీఎన్ఏ ప్రొఫైలింగ్ అందుబాటులోకి : ఏజిలెంట్ టెక్నాలజీ

మన శరీరం పరిస్థితిని క్షుణ్ణంగా తెలుసుకోవాలంటే డీఎన్ఏ ప్రొఫైలింగ్ చేయించుకోవాలి. ఇలా చేయడం ద్వారా రాబోయే ఆరోగ్య సమస్యలను ముందుగా గుర్తించడం, చికిత్స అందించడం సులభతరం అవుతుంది. ఏజిలెంట్ టెక్నాలజీ డీఎన్ఏ విశ్లేషణకు అవసరమైన యంత్రాలను సమకూర్చుతుంది. వీటిని ప్రముఖ ఆస్పత్రులు, పరిశోధన సంస్థలకు అందిస్తున్నాం.

ఫార్మా, క్లినికల్ ట్రయల్స్‌లో ఏఐ సహకారం : కోజెనిక్ ఏఐ

కృత్రిమమేథ సహకారంతో ఫార్మా రంగంలో ఔషధాల తయారీ, క్లినికల్ ట్రయల్స్ పరిశోధనలను సులభంగా నిర్వహించే అవకాశాన్ని కోజెనిక్ ఏఐ అందుబాటులోకి తెచ్చింది. ఔషధాల తయారీతోపాటు వాటి వినియోగం వల్ల వచ్చే దుష్ఫలితాలను కృత్రిమ మేథ ద్వారా గణించి, ప్రభుత్వ నిబంధనలకు తగిన విధంగా నివేదికను రూపొందించే సాఫ్ట్‌వేర్‌ను రూపొందించినట్లు సంస్థ కో ఫౌండర్ రమేష్ సేత్ తెలిపారు.

ఎక్కడికైనా తీసుకెళ్లగలిగే ఈజీ సర్వర్ రూమ్



ఐటీ, ఫార్మా సంస్థలు తమ కంప్యూటర్లను, అందులో ఉన్న సమాచారాన్ని భద్రపరుచుకునేందుకు సర్వర్లు కీలకం. వెర్టివ్ సర్వర్ రూమ్‌ను అన్ని భద్రత ఏర్పాట్లతో పాటు సులభంగా ఒకచోట నుంచి మరో చోటికి తీసుకెళ్ల వచ్చని తయారీ దారులు తెలిపారు. ప్లగ్ అండ్ ప్లే తరహాలో సర్వర్ రూములు రూపొందిస్తున్నామని, ఆయా సంస్థలకు అవసరమైన విధంగా కస్టమైజేషన్ చేసి అందిస్తామన్నారు.

రూ.4,030 కోట్లతో
రతన్‌టాటా రోడ్డు

- 41.50 కిమీల గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రహదారి
- 28వ తేదీ నుంచి టెండర్లు



రతన్ టాటా రోడ్డు (చిలకపచ్చ రంగులో ఉన్న గీత)

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఓఆర్ఆర్‌లోని రావిర్యాల(టాటా ఇంటర్‌చేంజ్) నుంచి ఫ్యూచర్ సిటీ మీదుగా ఆమన్‌గల్ వద్ద ప్రతిపాదిత ఆర్ఆర్ఆర్ వరకు నిర్మించ తలపెట్టిన గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రహదారికి రాష్ట్ర ప్రభుత్వం రతన్‌టాటా రోడ్డుగా పేరు పెట్టింది. ఈ రోడ్డును రూ.4,030 కోట్లతో నిర్మించనున్నారు. 41.50 కి.మీ.ల పొడవు ఉండే ఈ రతన్ టాటా రహదారి నిర్మాణాన్ని రెండు దశల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొదటి దశలో రూ.1,665 కోట్లతో ఓఆర్ఆర్ రావిర్యాల(టాటా ఇంటర్‌చేంజ్) నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు 19.2 కి.మీ దూరం రోడ్డు నిర్మాణం చేపడతారు. రెండోదశలో రూ.2,365 కోట్లతో మీర్‌ఖాన్‌పేట(ఫ్యూచర్‌సిటీ) నుంచి ఆర్ఆర్ఆర్ (ఆమన్‌గల్) వరకు 22.30 కి.మీ దూరం రహదారి నిర్మాణం చేయనున్నారు. ఈ రహదారి నిర్మాణ బాధ్యతలను ప్రభుత్వం హెచ్ఎండీఏకు, హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్(హెచ్‌జీసీఎల్) సంస్థలకు అప్పగించింది. ఈ నేపథ్యంలో రహదారి నిర్మాణ పనులకు సంబంధించిన టెండర్లను ఫిబ్రవరి 28 నుంచి స్వీకరిస్తామని హెచ్ఎండీఏ మంగళవారం ప్రకటించింది. టెండర్ వివరాలను తమ అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచింది. సాంకేతిక బిడ్లను మార్చి 21న తెరుస్తామని హెచ్ఎండీఏ వెల్లడించింది.



భూమేశ్వర స్వామి మహాశివ లింగం



సీతారాంపురంలోని శివపంచాయతన ఆలయం



మహేంద్రాహిల్స్‌లోని మహాశివుడు



భూమేశ్వర స్వామి ఆలయం ముస్తాబు



బోయిన్‌పల్లి పోస్టాఫీస్ వెనకాల ఉన్న పురాతన శివాలయం

మహా శివరాత్రికి ఆలయాలు ముస్తాబు

మారేడుపల్లి/తిరుమలగిరి/రాంగోపాల్‌పేట్/చిలకలగూడ/బోయిన్‌పల్లి/అమీర్‌పేట, ఫిబ్రవరి, 25(ఆంధ్రజ్యోతి): పికెట్‌లోని పంచభూత భూమేశ్వర స్వామి శివపంచాయతన శివాలయంలో ఏర్పాట్లు చేశామని ఆలయ నిర్వాహకులు జెట్టి ఉమేశ్వరరావు తెలిపారు. బుధవారం తెల్లవారు జాము నుంచి గురువారం ఉదయం వరకు అనిల్ శర్మ ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయని ఆయన తెలిపారు.

- మహేంద్రాహిల్స్ శాంతినికేతన్ కాలనీలో పహాడీ సాయిబాబా సేవాట్రస్ట్ (హనుమాన్ మందిర్) ఆధ్వర్యంలో గుట్టపై మహాశివుడు సర్వాంగ సుందరంగా కొలువుదీరాడు. మారేడుపల్లి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాట్లు చేశామని ఆలయ చైర్మన్ రేపాల వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 108 కళశాలతో అభిషేకం, అన్నాభిషేకం వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.
- బొల్లారం డౌటన్ బజార్‌లోని రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానం (శివాలయం), బొల్లారంలోని కుటియా టెంపుల్, సదర్ బజార్‌లోని మహంకాళి ఆలయాలను నిర్వాహకులు సర్వ సిద్ధం చేశారు. టెంపుల్ అధ్యక్షుడు పవన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జీవి బాల్‌రాజ్, శ్రీధర్ యాదవ్, అబ్బయ్య రాజు, కన్న పాల్గొన్నారు.
- చిలకలగూడ మున్సిపల్ మైదానంలో సాయంత్రం 6 గంటల నుంచి రుద్రాభిషేకం పూజా కార్యక్రమాలు జాగరణకు ఏర్పాట్లు చేసినట్టు ఆధ్యాత్మిక వేత్త బండపల్లి సతీష్ ఓ ప్రకటనలో తెలిపారు.
- కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని 1, 6వ వార్డుల్లోని బోయిన్‌పల్లి ప్రాంతంలోని శివాలయాలను విద్యుత్ దీపాలు, రంగురంగుల పువ్వులతో స్వాగత తోరణాలతో ముస్తాబు చేశారు. బోయిన్‌పల్లి పరిధిలోని శివాలయాలను ముస్తాబు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో డీఐ సర్దార్ నాయక్, ఎస్ఐలు శివశంకర్, నాగేంద్రబాబు, గిరిధర్, కల్పనల పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.
- అమీర్‌పేట హనుమాన్ ఆలయంలో ఉదయం 4:30 గంటల నుంచి ప్రత్యేక అభిషేకం, సాయంత్రం 4 గంటల నుంచి లింగ స్పర్శ దర్శనం, రాత్రి 10 గంటలకు శివపార్వతుల కల్యాణోత్సవం, రాత్రి 12 గంటలకు లింగోద్భవ అభిషేకం నిర్వహించనున్నట్టు ఈవో జయంతి వెల్లడించారు. క్యూ, చలువ పందిళ్లు, షామియానాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. బాపూనగర్‌లోని వీరాంజనేయ వేంకటేశ్వర సాయిబాబా ఆల యం, సైంటిఫిక్ కాలనీలోని సాయిమణికంఠ ఆల యం, బల్కంపేటలోని ఆంజనేయ షిరిడీ సాయిబాబా శివాలయం ముస్తాభయ్యాయి.

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆయా డివిజన్లలోని ఆలయాలను ఆలయ కమిటీ సభ్యులు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. వేలాదిగా తరలి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. శివాలయాల్లో బుధవారం తెల్లవారు జామున 4 గంటల నుంచి సాయంత్రం వరకు స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

ఆలయాభివృద్ధికి కృషి



యాంపిల్ వైర్ బాక్స్‌ను విజయ్‌కుమార్‌కు అప్పగిస్తున్న ఆలయ చైర్మన్ లక్ష్మణ్ ప్రసాద్, కమిటీ సభ్యులు

అడ్డగుట్ట: 150 ఏళ్ల చరిత్ర ఉన్న తుకారాంగేట్‌లోని పహాడి హనుమాన్ ఆలయాభివృద్ధికి కృషి చేస్తున్నామని ఆలయ చైర్మన్ మేకల లక్ష్మణ్ ప్రసాద్ తెలిపారు. తుకారాంగేట్‌కు చెందిన ఓ భక్తుడు ఆలయానికి ఎండోమెంట్ అధికారి విజయ్ కుమార్‌కు అందజేయడంతో మంగళవారం రూ.19వేలు విలువ చేసే యాంపిల్ వైర్(సౌండ్ బాక్సు) బాక్సును వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ముఖ్య సలహాదారుడు ఆదం భరత్ కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహంకాళి ఏసీపీ బదిలీ



ఏసీపీ సైదయ్య

రాంగోపాల్ పేట్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మహంకాళి ఏసీపీ సర్దార్ సింగ్ బదిలీ అయ్యారు. రాష్ట్ర డీజీపీ జితేందర్ మంగళవారం బదిలీ చేసి డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో సిటీ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (సీసీఆర్‌బీ)లో చేస్తున్న ఎస్.సైదయ్యను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా మంగళవారం రాత్రి బదిలీ ఉత్తర్వులు అందిన వెంటనే ఏసీపీ ఎస్.సైదయ్యకు సర్దార్ సింగ్ బాధ్యతలు అప్పగించి రిలీవ్ కావడం పలు సందేహాలకు తావిస్తోంది. మహబూబ్ కాలేజ్ ఎస్‌వీఐటీలో ఓ వర్గానికి మద్దతుగా నిలిచారని ఆరోపణలు వచ్చినందు వల్ల ఈ బదిలీ జరిగిందని విశ్వసనీయ సమాచారం.

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలి



జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ సామల హేమ

బౌద్ధనగర్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్‌లో పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కార్పొరేటర్ సామల హేమ కోరారు. మంగళవారం జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సుభాష్‌రావును వారి కార్యాలయాల్లో కలిసి వినతిపత్రాలు అందజేశారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని నీటి కొరత ఏర్పడకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని కోరారు. రేషన్‌కార్డుల జారీ విషయంలో లబ్ధిదారులకు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కరాటేరాజు, రాజు సుందర్ తదితరులు పాల్గొన్నారు.

యువత మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలి

- సీనియర్ సైకాలజిస్ట్ డాక్టర్ ఎం.ఏ. కరీం

రాంగోపాల్‌పేట్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): లక్ష్య సాధనలో ఎదురయ్యే అవాంఛిత ఆలోచనలకు యువత దూరంగా ఉండాలని తెలంగాణ సైకలాజికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రముఖ సీనియర్ సైకాలజిస్ట్ డాక్టర్ ఎం.ఏ. కరీం యువతకు పిలుపునిచ్చారు. మంగళవారం సికింద్రాబాద్‌లోని యూత్ హాస్టల్‌లో యువజన సర్వీసులు, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఇంటర్ స్టేట్ యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంలో యువతలోని మానసిక దృఢ త్వాన్ని పెంపొందించేందుకు మానసిక అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అనంతరం టర్నింగ్ పాయింట్ లైఫ్ స్కిల్స్‌పైన ప్రయోగాత్మక డెమో రూపంలో బోధించారు. యువత మత్తు మాదక ద్రవ్యాల వైపు వెళ్లకుండా తెలంగాణ సైకలాజికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హెల్ప్ లైన్ లోగోను ఆవిష్కరించారు. మత్తు మాదకద్రవ్యాల నిర్మూలనకు 9440488571, 040 4357171915 నంబర్లలో రోజూ ఉదయం పది నుంచి సాయంత్రం 6గంటల వరకు మానసిక నిపుణులు అందుబాటులో ఉంటారని వివరించారు. కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా యువజన అధికారి ఖుష్బూ గుప్తా, ప్రోగ్రాం అధికారి యాదగిరి, యువజన సర్వీసుల శాఖ అధికారులు, తమిళనాడు నుంచి వచ్చిన యువకులు పాల్గొన్నారు.

చెత్త కుప్పలను తొలగించండి



జీహెచ్ఎంసీ ఉపకమిషనర్ సుభాష్‌రావుకు వినతి పత్రం అందజేస్తున్న సెవాదళ్ సంఘం ప్రతినిధులు

అడ్డగుట్ట, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): అడ్డగుట్ట డివిజన్‌లోని తుకారాం గేట్ సమోసా గార్డెన్‌లో గుట్టలుగా పేరుకపోయిన చెత్తకుప్పలకు నిప్పంటుకోవడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఈ నేపథ్యంలో సమోసా గార్డెన్‌లో వెంటనే చెత్త, మట్టికుప్పలను తొలగించాలని కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి సంగీత, రామలీల, సికింద్రాబాద్ ఉపాధ్యక్షురాలు మేరీ, వరలక్ష్మి, రవి మంగళవారం సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ సుభాష్ రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా రామలీల మాట్లాడుతూ.. సమోసా గార్డెన్‌లో ఖాళీ మైదానం అసాంఘిక అడ్డగా మారిందన్నారు. చుట్టు పక్క ప్రాంతాల వారు చెత్తను మట్టికుప్పలను ఈ గార్డెన్‌లో వేయడంతో గతంలో అనేక సార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశామని, సోమవారం రాత్రి 10 గంటలకు గార్డెన్‌లో చెత్తకు ప్రమాదశాత్తు నిప్పంటుకొని భారీగా మంటలు వ్యాపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారని పేర్కొన్నారు. వెంటనే ఆ గార్డెన్‌లో శుభ్రం చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఉప కమిషనర్‌ను కోరారు.

నిజాయితీని చాటుకున్న ట్రాఫిక్ సిబ్బంది



తన సిబ్బందితో కలిసి నగదు అందజేస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఉపశంకర్

రాంగోపాల్‌పేట్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): చిల్లర వ్యాపారం చేసే వ్యక్తి పోగొట్టుకున్న నగదును తిరిగి అందజేసి మహంకాళి ట్రాఫిక్ పోలీసులు తమ నిజాయితీని చాటుకున్నారు. బాలంరాయిలో నివసించే సాగనారాయణ మంగళవారం ఓ టిఫిన్ సెంటర్‌లో ఇవ్వడానికి వెళ్లే సమయంలో చిల్లర నగదు రూ.2500ను రాణిగంజ్ చౌరస్తా వద్ద తన సంచిలో నుంచి పడిపోయాయి. అక్కడే విధులు నిర్వహిస్తున్న మహంకాళి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఉపశంకర్, ఏఎస్సై రవి సుధాకర్, జమిదార్ సత్యప్రసాద్, హోంగార్డ్ నాయుడు వాటిని గుర్తించి తీసి పెట్టుకున్నారు. కొద్దిసేపటి తర్వాత సాగనారాయణ పోయిన నగదును వెత్తుకుంటూ అక్కడికి వచ్చేసరికి విషయం తెలుసుకొని నగదు యజమాని అతడేనని నిర్ధారించుకొని నగదును అప్పగించి నిజాయితీని చాటుకున్నారు.

వెట్టిచాకిరీ వ్యవస్థను నిర్మూలించాలి



వెట్టి చాకిరీ వ్యవస్థ నిర్మూలన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పోలీసులు

బౌద్ధనగర్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): సమాజంలో వెట్టిచాకిరీ వ్యవస్థను నిర్మూలించడానికి ప్రభుత్వం చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని పలువురు కోరారు. దివ్యదిశ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం చిలకలగూడ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ కె.రమేష్‌గౌడ్, అడ్మిన్ ఎస్సై ఆంజనేయులు, సిబ్బంది తదితరులు పాల్గొని వెట్టిచాకిరీ వ్యవస్థ నిర్మూలన పోస్టర్‌ను ఆవిష్కరించారు. వెట్టిచాకిరీ వ్యవస్థ నిర్మూలన చట్టంపై ప్రజలకు పూర్తిగా అవగాహన ఉండాలన్నారు.

డ్రగ్స్, సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి



ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శివశంకర్

బోయిన్‌పల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ సైబర్ నేరాలపై అవగాహన ఉండాలని బోయిన్‌పల్లి ఎస్ఐ శివశంకర్ అన్నారు. బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బోయిన్‌పల్లి పోలీసులు మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎస్ఐ శివశంకర్ విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంజాయి, డ్రగ్స్, మత్తు మందులు, గుట్కాలు ప్రమాదకరమన్నారు. విద్యార్థులు ఇంటర్నెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని, సైబర్ మోసగాళ్ల ఉచ్చులో పడొద్దని సూచించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1930కి కాల్ చేయాలన్నారు. వ్యక్తిగత ఫొటోలను డీపీలుగా పెట్టుకోవద్దన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేనివారు డ్రైవింగ్ చేయవద్దని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. కార్యక్రమంలో బోయిన్‌పల్లి పోలీసులు శిక్షణలో ఉన్న ఎస్ఐ రాజు, కోటేశ్వరరావు, రమణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భవిష్యత్తుపై స్పష్టమైన దృక్పథం కలిగి ఉండాలి



ప్రసంగిస్తున్న ఏసీపీ శంకర్‌రాజు

హరిహర కళాభవన్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్, హరిహర కళాభవన్‌లో మంగళవారం గుర్తింపు పొందిన విద్యా సంస్థల ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకి ప్రేరణాత్మక ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. పలువురు వక్తలు ప్రసంగిస్తూ పరీక్షలకి హాజరైయ్యే విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో భవిష్యత్తుపై స్పష్టమైన దృక్పదంతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఏసీపీ ట్రాఫిక్ నార్త్ జోన్ జి.శంకర్ రాజు, ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ గంపా నాగేశ్వర రావు, తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.అర్జున్, డైరెక్టర్ మెరిటో జూనియర్ కాలేజీ పి.సుధాకర్, తదితతరులు తమ సందేశాలు అందజేశారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి



అడ్డగుట్ట, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లో ఫుట్‌పాత్‌పై గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడు. ఈసంఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై మాదవి తెలిపిన వివరాల ప్రకారం... సికింద్రాబాద్ సమీపంలోని గురుద్వార మెడికల్ దుకాణం సమీపంలో గుర్తుతెలియని (60)వృద్ధుడు చనిపోయి ఉండగా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని గాంధీ మార్చురికి తరలించారు. మృతుడి ఆచూకీ వివరాలు ఇంకా తెలియరాలేదని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.